

బాగు చెయ్యండి ప్లీజ్..!



యాడికి - బుగ్గ రోడ్డు

చూస్తున్నారు కదా..? ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో..! యాడికి నుంచి బుగ్గకు వెళ్లే రోడ్డు, రాయలచెరువు నుంచి చందనకు, అక్కడి నుంచి దైవాలమడుగు వరకూ వెళ్లే రోడ్డు, యాడికి నుంచి రాయలచెరువుకు వెళ్లే రోడ్డు, తూట్రాళ్లపల్లి నుంచి నగరూరుకు వెళ్లే రోడ్డు.. ఏ దారి చూసినా గుంతలమయమే. వర్షాలు కురవగానే చిన్నపాటి నీటి మడుగులుగా మారుతాయి. ఆ తరువాత బురదగుంతలుగా తయారౌతాయి. ఎండకాచి ఆరిపోయిన తరువాత.. దుమ్ము రేగుతాయి. ఇలా ఒకదాని తరువాత ఒక విపత్తు వాహనదారులకు ఎదురౌతూనే ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పినా ఆస్పత్రిపాలు కావాల్సిందే. కార్లు, ఆటోలు ఇతర వాహనాల టైర్లు, విడి భాగాలు దెబ్బతింటున్నాయి. వాహనాలు వెళ్లే సమయంలో పక్కన ప్రయాణించే వారిపై బురద చిట్లడం అదనపు సమస్య. ఈ దారుల్లో ప్రయాణించడం సాహస క్రీడల్లో పాల్గొనడంలాంటిదే. వైసీపీ పాలనలో గ్రామీణ రహదారుల నిర్వహణను గాలికి వదిలేశారు. అందుకే పరిస్థితి ఇలా తయారైంది. కూటమి ప్రభుత్వం వాటిని సరిచేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. సాధ్యమైనంత త్వరగా ఆ పనిచేసి పుణ్యం కట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - యాడికి



చందన - దైవాలమడుగు రోడ్డు



పచ్చారుమేకలపల్లి - చందన రోడ్డు



యాడికి - రాయలచెరువురోడ్డు

కేశవ్‌కు అరుదైన గౌరవం

స్వాతంత్ర్య దినోత్సవాలకు ముఖ్య అతిథి

పోలీస్ పరేడ్ మైదానంలో 15న వేడుకలు

జాతీయ జెండాను ఆవిష్కరించనున్న ఆర్థిక మంత్రి



అనంతపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. జిల్లాలవారీగా జాతీయ జెండాను ఆవిష్కరించే మంత్రుల జాబితాను సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న పయ్యావుల కేశవ్‌కు అరుదైన అవకాశం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవాలు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ ప్రాధాన్య అంశాలు, జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చొరవ గురించి ప్రజలకు వివరిస్తారు.

దశాబ్దాల శ్రమ..

1994లో అప్పటి ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పిలుపుతో పయ్యావుల కేశవ్ పార్టీలో చేరి, తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల వరకూ ఏడుసార్లు ఉరవకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఐదుసార్లు విజయం సాధించారు. ఒకసారి ఎమ్మెల్సీగా సేవలు అందించారు.

ఉరవకొండలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ ప్రతిపక్షానికి పరిమితమౌతుందన్న మూఢ నమ్మకం 2019 ఎన్నికల వరకూ కొనసాగింది. దీనికి కేశవ్ తెరదించారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నుంచి ఆయన ఘన విజయం సాధించారు. రాజకీయాల్లోకి వచ్చిన మూడు దశాబ్దాల తరువాత మంత్రి అయ్యారు. తొలిసారే కీలకమైన ఆర్థిక శాఖను దక్కించుకున్నారు. ఇప్పుడు స్వాతంత్ర్య దినోత్సవాలలో జాతీయ జెండాను ఆవిష్కరించే అరుదైన గౌరవం తమ నాయకుడికి దక్కినందుకు నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.



యాడికిలో బీడు పొలం

వేరుశనగ వేయలేకపోయా..

ఈ సారి వర్షాలు సరిగా పడకపోవడంతో వేరుశనగ సాగు చేయలేకపోయాను. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన తర్వాత కురిసిన వర్షాలకు పొలంలో సేద్యం పనులు చేసుకున్నాను. ఆ తర్వాత పదును వర్షం పడకపోవడంతో వేరుశనగ విత్తలేకపోయాను. అందుకే ఆలస్యంగా కంది పంట వేశాను. కంది విత్తిన తర్వాత ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో ఎదుగుదల కనిపించడం లేదు. దిగుబడి వస్తుందో రాదో అర్థం కావడం లేదు.

- శేఖర్‌రెడ్డి, యాడికి

- ప్రధాన పంట వేరుశనగకు దాటిన అదును
- జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు
- ఇప్పటి దాకా 1.43 లక్షల హెక్టార్లలోనే పంటల సాగు
- బీడు పడిన 2.03 లక్షల హెక్టార్ల పొలాలు
- ప్రత్యామ్నాయ పంటలకైనా పదును వాన పడేనా..?

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సాగు నిరాశజనకంగా ఉంది. జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు కాగా... ఇప్పటి దాకా 1.43 లక్షల హెక్టార్లలో మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. మిగిలిన 2.03 లక్షల హెక్టార్ల పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ప్రకృతి సహకరిస్తుందన్న ఆశతో తాజాగా 40 వేల హెక్టార్లలో రైతులు కంది విత్తుకోవడంతో ఆమాత్రం సాగు విస్తీర్ణమైనా కనిపిస్తోంది. రెండు వారాల కిందట 80 వేల హెక్టార్లలో మాత్రమే విత్తనం పడింది. ఆ తరువాత కందితోపాటు వేరుశనగ, ఇతర పంటలను కొంతమేర సాగు చేశారు. దీంతో 1.43 లక్షల హెక్టార్లకు చేరిందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. - అనంతపురం అర్బన్/యాడికి

ఖరీఫ్‌ను వెంటాడుతున్న వర్షాభావం

వేరుశనగ లేనట్లే..

ప్రతి ఏటా జూన్ 15 నుంచి ఆగస్టు 5 వరకు వేరుశనగ విత్తడానికి అదును సమయమని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. ఈ ప్రకారం ఈ నెల 5వ తేదీకే వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. ఇప్పుడు వర్షా లు పడినా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాల్సిందే. వేరుశనగ సాగు చేస్తే దిగుబడులు రావని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

చినుకు రాలలేదు..

ఈ సంవత్సరం ఖరీఫ్‌ను వర్షాభావం వెంటాడింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ముందస్తుగానే జూన్ 2న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. అయినా ఆశించిన స్థాయిలో ప్రయోజనం లేకపోయింది. జూన్ సరాసరి సాధారణ వర్షపాతం 61.0 మి.మీ. కాగా గత సంవత్సరం జూన్‌లో 45.8 మి.మీ. నమోదైంది. ఈ ఏడాది 147.7 మి.మీ. నమోదైంది. అయితే జూలై సరాసరి సాధారణ వర్షపాతం 63.9 మి.మీ. కాగా గత ఏడాది జూలై లో 73.3 మి.మీ. నమోదైంది. ఈ ఏడాది 24.4 మి.మీ. మాత్రం నమోదైంది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ. కాగా ఇప్పటి దాకా 7.3 మి.మీ. నమోదైంది. ఈ ఏడాది జూన్‌లో సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైనా.. పంటలను సాగు చేయలేకపోయారు. మే నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో జూన్ నెల అంతా దుక్కులు దున్ని సేద్యం పనులు చేసుకునేందుకే సరిపోయింది. కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నా.. పదును వర్షాలు లేవు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలకే పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సాగుకైనా అవకాశం ఉంటుందా అని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

1.43 లక్షల హెక్టార్లల్లో పంటల సాగు

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు. ఇందులో వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లు ఉంటుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి దాకా అన్ని పంటలు కలిపి 1.43 లక్షల హెక్టార్లల్లోనే సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 53 వేల హెక్టార్లు, కంది 40 వేలు, పత్తి 21వేలు, ఆముదం 12 వేలు, మొక్కజొన్న 7,580, సజ్జ 2,149, కొర్ర 2,645 హెక్టార్లల్లో సాగయ్యాయి. మిగతా విస్తీర్ణంలో జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్స్, పెసలు, మినుములు తదితర పంటలను సాగుచేశారు. జిల్లా వ్యాప్తం గా ఇంకా 2.03 లక్షల హెక్టార్లల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది. వర్షాభావంతో ఆయా పొలాలను బీడు పెట్టాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది ఖరీఫ్‌లో ఇదే సమయానికి 2.05 లక్షల హెక్టార్లల్లో వివిధ పంటలు సాగయ్యాయి.

అరకొర పదునుకే..



ఈ సారి అరెకర పదునుకే మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశాను. వర్షాభావంతో పంట ఎదుగుదల లేదు. విత్తనం వేసిన తర్వాత సరిపడా వర్షం కురిసి ఉంటే మంచి దిగుబడి వచ్చేది. గతేడాది మాదిరిగానే ఈ సారి వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు సరిగా పడకపోవడంతో దిగుబడిపై అనుమానంగానే ఉంది.

- చంద్రశేఖర్, కత్తి మానుపల్లి, యాడికి మండలం

అదును దాటిపోయింది..

ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు అదును సమయం ఇప్పటికే దాటిపోయింది. ఈ సారి ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో పంటల సాగువిస్తీర్ణం తగ్గింది. ఇప్పుడు వేరుశనగ విత్తుకున్నా దిగుబడి రాదు. జొన్న, కొర్ర, పెసర, అలసంద, ఉలవ, మినుము తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటే ఫలితం ఉంటుంది. రైతులు ఆ దిశగా ఆలోచించాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి.

- డాక్టర్ చంద్రాయుడు, ప్రధాన శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం కేవీకే



గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలు నిర్మిస్తాం : కలెక్టర్



బుక్కరాయ సముద్రం గిరిజన పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

బుక్కరాయసముద్రం, ఆగస్టు 9: నూతన సాంకేతిక ప్రమాణాలతో ఏపీ గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలను నిర్మిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుక్కరాయసముద్రంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, గదుల కొరత సమస్యను ప్రిన్సిపాల్ హరేజేనాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని, లేదంటే కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాల భవనాలకు సిద్దరాంపురం రోడ్డు వద్ద కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణాలకు ఖర్చు నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, తహసీల్దారు పుణ్యవతి, ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు.



సీఐల బదిలీ.. డీఐజీ ఉత్తర్వులు

అనంతపురం క్రైం, ఆగస్టు 9: ఉమ్మడి జిల్లాల పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు సీఐలను వీఆర్‌కు పంపగా, మరికొందరికి పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలుగా బదిలీ చేశారు. మొత్తం 28 మంది సీఐలను బదిలీ చేశారు. మరికొందరు సీఐల బదిలీలు కావాల్సి ఉంది. అనంతపురం పరిధిలో వన్‌టౌన్, రూరల్ సీఐ స్థానాలను పెండింగ్‌లో ఉంచారు. త్వరలో వాటితో పాటు గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, రాయదుర్గం, మడకశిర, ధర్మవరం ప్రాంతాల్లో బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సాయినాథ్	వీఆర్, ఏఆర్,అనంతపురం	ఫోర్త్‌టౌన్,ఏటీపీ
ప్రతాప్‌రెడ్డి	ఫోర్త్‌టౌన్,అనంతపురం	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
రఘుప్రసాద్	సెబ్,అనంతపురం	ట్రాఫిక్,ఏటీపీ
నారాయణరెడ్డి	ట్రాఫిక్,ఏటీపీ	కదిరి పీఎస్
పుల్లయ్య	కదిరి పీఎస్	వీఆర్,ఎస్పీ,సత్యసాయి
శ్రీధర్	శింగనమల సర్కిల్	బుక్కరాయసముద్రం
వెంకటేశ్వర్లు	బుక్కరాయసముద్రం	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
రాజేంద్రనాథ్	నల్లమాడ	కళ్యాణదుర్గం రూరల్ యూపీఎస్
చంద్రశేఖర్	కళ్యాణదుర్గం రూరల్	వీఆర్,ఎస్పీ, ఏటీపీ
నీలకంఠేశ్వర్	ఇంటెలిజెన్స్, ఏటీపీ	కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్
నాగరాజు	కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్	వీఆర్,ఎస్పీ, ఏటీపీ
ఇందిర	ఎస్పీ, అనంతపురం	కొత్తచెరువు యూపీఎస్
రాజారమేష్	కొత్తచెరువు యూపీఎస్	వీఆర్,ఎస్పీ,శ్రీసత్యసాయి
జగన్‌మోహన్‌రెడ్డి	డీటీసీ, తిరుపతి	వీఆర్, ఎస్పీ, ఏటీపీ
జనార్దన్	సీసీఎస్, ఏటీపీ	హిందూపురం రూరల్ సర్కిల్
శ్రీనివాసులు	హిందూపురంరూరల్ సర్కిల్	వీఆర్, ఎస్పీ, శ్రీ సత్యసాయి
శేఖర్	వీఆర్, ఎస్పీ, ఏటీపీ	గోరంట్ల యూపీఎస్
సుబ్బరాయుడు	గోరంట్ల యూపీఎస్	వీఆర్ ఎస్పీ,శ్రీసత్యసాయి
సురేష్	వీఆర్, ఎస్పీ, చిత్తూరు	పుట్టపర్తి రూరల్ సర్కిల్
రాగిరి రామయ్య	పుట్టపర్తి రూరల్ సర్కిల్	వీఆర్,ఎస్పీ,శ్రీసత్యసాయి
సునీత	డీటీసీ, పుట్టపర్తి	పుట్టపర్తి అర్బన్ పీఎస్
కొండారెడ్డి	పుట్టపర్తి అర్బన్ పీఎస్	వీఆర్,ఎస్పీ,శ్రీసత్యసాయి
శాంతిలాల్	వీఆర్,అనంతపురం	అనంతపురం త్రీటౌన్
ధరణికిషోర్	అనంతపురం త్రీటౌన్	ఎస్పీ, అనంతపురం
హేమంత్‌కుమార్	సైబర్ క్రైం,శ్రీ సత్యసాయి	ఇటుకలపల్లి సర్కిల్
నరేంద్రరెడ్డి	ఇటుకలపల్లి సర్కిల్	వీఆర్,ఎస్పీ,అనంతపురం
శ్రీ హర్ష	డీసీఆర్‌బీ, శ్రీ సత్యసాయి	రాప్తాడు యూపీఎస్
మునిస్వామి	రాప్తాడు యూపీఎస్	వీఆర్,ఎస్పీ,అనంతపురం

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 9: వెలంకని ఉత్సవాల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ముంబై-వెలంకని మధ్య గుంతకల్లు మీదుగా ప్రత్యేక (ధరల) రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ముంబై-వెలంకని (నెం. 01161) ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు ముంబైలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 3:05 గంటలకు గుంతకల్లుకు వచ్చి, రాత్రి 11:50 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 01162) వెలంకనిలో 28వ తేదీ ఉదయం 3 గంటలకు బయలుదేరి రాత్రి 12 గంటలకు గుంతకల్లుకు వచ్చి మరుసటి రోజు సాయంత్రం 4:20 గంటలకు ముంబైకు చేరుతుందన్నారు. ముంబై-వెలంకని (నెం. 01163) ప్రత్యేక రైలు ముంబైలో సెప్టెంబరు 7వ తేదీన, దాని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 01164) వెలంకనిలో సెప్టెంబరు 9వ తేదీన పైన తెలిపిన సమయాల్లోనే బయలుదేరి గమ్యాలకు అవే సమయాల్లో చేరుకుంటాయన్నారు. ఈ రైళ్లు థానే, కళ్యాణ్, లోనావాలా, పూణే, దౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, కడప, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, వెల్లూరు కంటోన్మెంటు, తిరువన్నామలై, విల్లుపురం, పన్రుతి, తిరుపద్రిపుల్యూరు, చిదంబరం, సిర్కాజి, వైతీస్వరణ్ కోయిల్, మయిలదుతురై, తిరువన్నూర్, నాగపట్టణం స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు.

బెంగళూరు-కలబురగి మధ్య..

ప్రయాణికుల రద్దీ నియంత్రణకు మూడు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు-కలబురగి (నెం. 06533) ప్రత్యేక రైలును ఈ నెల 14, 16, 17 తేదీల్లో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలు పేర్కొన్న తేదీల్లో రాత్రి 9:15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:45 గంటలకు కలబురగికి చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06534) కలబురగిలో ఈ నెల 15, 17, 18 తేదీల్లో ఉదయం తొమ్మిదిన్నరకు బయలుదేరి అదేరోజు రాత్రి 8గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందని వివరించారు. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, షాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

టీబీ డ్యాంలో 105 టీఎంసీల నిల్వ

బొమ్మనహాళ్, ఆగస్టు 9: తుంగభద్ర జలాశయంలో 105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గురువారం 48,439 కూసెక్కులు ఉండగా.. ఇన్‌ఫ్లో రావడంతో శుక్రవారం సాయంత్రానికి 53,654 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 5 క్రస్ట్ గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నదికి 12,464 క్యూసెక్కులు, కాలువలకు 10,445 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 22,909 క్యూసెక్కుల నీటిని బయటికి వదులుతున్నారు. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో శుక్రవారం సాయంత్రం నాటికి 1632.93 అడుగులతో 105.507 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105 వ కి.మీ. వద్ద 1320 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 9: సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ స్కీమ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ రెండు పథకాల ద్వారా రెండు వేల గ్రామాలకు తాగు నీరు అందించేందుకు ఎన్నో సంవత్సరాలుగా 1300 మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. ఆ సంస్థలను నిర్వీర్యం చేసి, రద్దు చేసే కుట్రలో భాగంగా 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అష్యూరెన్స్ కమిటీ రిపోర్ట్ ఇచ్చిందని అన్నారు. దీనివల్ల సగం మంది కార్మికులు ఉద్యోగాలను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పనిభారంతో ఉన్న కార్మికులకు పొమ్మనకుండా పొగపెడుతున్నారని అన్నారు. ఇలాంటి రిపోర్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఐఎఫ్‌టీయూ నాయకులు ఉపేంద్ర, రాము పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు నిరసన చేపడుతున్న వాటర్ వర్క్స్ స్కీమ్‌ల కార్మికులు

ఉనికి కోసం వైసీపీ నాటకాలు

జగన్‌ది ప్రస్తుతం క్రికెట్ టీమ్
ఆఖరుకు మిగిలేది షటిల్ జట్టే
మంత్రి సవిత ఎద్దేవా


రోడ్‌షోలో విజయ సంకేతం చూపుతున్న మంత్రి సవిత

గోరంట్ల, ఆగస్టు 9: అధికారం ఉందికదా అని అరాచకాలకు పాల్పడిన గత వైసీపీ పాలకులు నామరూపాల్లేకుండా పోయారనీ, ప్రస్తుతం ఉనికి కోసం నాటకాలు ఆడుతున్నారని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలో మంత్రి శుక్రవారం పర్యటించారు. రోడ్ షో, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గోరంట్లలోని బస్టాండు కూడలిలో ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల నియంత పాలన తరువాత వైసీపీ నాయకులు ఉనికి కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారు రక్ష కట్టించాలని చేసిన సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. పులివెందుల రెడ్డి (జగన్)కే ఉనికి లేదనీ, ఇక మిగిలిన వారి పరిస్థితి చెప్పక్కర్లేదన్నారు. క్రికెట్ టీమ్ తరహాలో జగన్ టీమ్‌లో ప్రస్తుతం 11 మంది ఉన్నారనీ, ఆఖరుకు మిగిలేది షటిల్ టీమ్ మాత్రమే అంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో భూఅక్రమాలు, దందాలపై ఉన్నతస్థాయి విచారణ చేయిస్తామని మంత్రి ప్రకటించారు. మండలంలో ప్రైవేటు, ప్రభుత్వ భూములను అక్రమంగా దోచుకున్నారన్నారు. ఒకొక్కటిగా వెలికి తీసి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం గోరంట్లలోని ఆంజనేయస్వామి కాలనీలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. మంత్రి హోదాలో తొలిసారి గోరంట్లకు వచ్చిన సవితకు అడుగడుగునా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఇంటికెళ్లి ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించి, మంత్రి జ్ఞాపిక అందజేశారు. నిమ్మలకుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంత్రి పర్యటనలో పెద్దఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లో ఎర్రచందనం సాగు లాభసాటి కాదు

ఇతర పంటల సాగుపై అవగాహన కల్పించండి
అధికారులకు పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి సూచన


ఎర్రచందనం మొక్కలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9: పంట పొలాలలో ఎర్ర చందనం పెంపకం అంత లాభసాటి కాదని పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. రైతులకు ఇతర పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. వడ్డుపల్లి సమీపంలో సోషల్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దీప ఆధ్వర్యంలో ఆర్డీటీ ఎకాలజీ సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. పొలం చుట్టూ నాటిన ఎర్ర చందనం మొక్కల పరిశీలించారు. ఎర్ర చందనం సాగు గురించి రైతులకు అవగాహన కల్పించడం మంచిదేనని, కానీ ఏ పదేళ్లకో అవి చేతికి వస్తాయని అన్నారు. వాటి మార్కెట్ గురించి రైతులకు తెలియదని, పైగా రంగు రాకపోతే వాటిని ఎవరూ కొనరని అన్నారు. తద్వారా రైతులు నష్టపోతారని అన్నారు. అక్కడికి సమీపంలో చీనీ తోటను పరిశీలించారు. ఇలాంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని, రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. తన పొలంలో పది ఎర్రచందనం మొక్కలను పెంచానని, అవి పెరిగి పెద్దవైనా ఎవరూ కొనడం లేదని ఓ రైతు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రంగు రాకపోతే మార్కెట్‌లో కొనుగోలు చేయరని, ఇలాంటి వాటి జోలికి వెళ్లవద్దని ఆయన రైతులకు సూచించారు. మార్కెట్‌పై అవగాహన లేకుండా ఎర్రచందనం మొక్కలను పొలాలలో పెంచవద్దని, అడవులలో పెంచవచ్చని సూచించారు.

కార్యాలయ పరిశీలన

అనంతపురం నగరంలోని సీసీఎఫ్ కార్యాలయాన్ని పీసీసీఎఫ్ పరిశీలించారు. విధులు నిర్వహించేచోట కలపను నిల్వ చేయడం సరికాదని అన్నారు. డీఎఫ్ఓ, సోషియల్ ఫారెస్ట్, రేంజర్, డీఆర్వో కార్యాలయాలను ఆయన పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. భవనాల మరమ్మతులు, లైటింగ్, రంగులు తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. టెరిటోరియల్ కార్యాలయంలోని ఒక గదిలో కలప నిల్వ చేయడంతో వెంటనే మరోచోటుకు మార్చాలని రేంజర్‌కు సూచించారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ వినీత్ కుమార్‌తో శాఖపరమైన అంశాలపై చర్చించారు.

పర్యాటక ప్రాంతంగా మార్చండి

పంపనూరు నగరవనాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని పీసీసీఎఫ్ సూచించారు. సీసీఎఫ్, డీఎఫ్ఓతో కలిసి నగరవనాన్ని పరిశీలించారు. సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సమీపంలో ఉన్న జింకలను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నగరవనంలో కలియతిరిగి.. అభివృద్ధి పనులకు సూచనలు చేశారు. హైవే సమీపంలో ఉన్నందున రోడ్డు హద్దులు చూసుకొని మొక్కలు నాటించాలని సూచించారు. నగర వనంలో మొక్కలను బాగా నాటారని, నిర్వహణ మరింత మెరుగుపడాల్సి ఉందని అన్నారు. రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్‌కు పలు సూచనలు చేశారు. పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. స్క్వాడ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి, రేంజర్లు శ్రీనివాసులు, డేవిడ్, వెంకటేశులు, డీఆర్వో ఉసేనప్ప, ఎఫ్‌బీఓలు జగదీష్‌యాదవ్, తేజేశ్వర్‌రెడ్డి, ఏబీఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు

తిరిగి విధుల్లోకి తీసుకోండి
కలెక్టరేట్ ఎదుట ఎస్పీవోల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 9: 'మా కుటుంబాలను రోడ్డున వేయొద్దు.. మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకుని ఆదుకోండి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీవోలు) వేడుకున్నారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన స్పెషల్ పోలీసులు శుక్రవారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వర్షం కురుస్తున్నా కూడా ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ధర్మచందు మాట్లాడుతూ.. జీవో నెంబరు 111 ప్రకారం మాజీ ఆర్మీ జవానులు, సివిల్ వ్యక్తులతో కలిపి ఏపీ స్పెషల్ ఆఫీసర్స్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా 2,156 మందిని పోలీసు శాఖకు అనుసంధానంగా గత ప్రభుత్వం నియమించిందని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో రాత్రీపగలు విధులు నిర్వహించి.. ఎర్రచందనం, మద్యం, గంజాయి తదితరాల అక్రమ రవాణాను నిరోధించామన్నారు. అయినా గత ప్రభుత్వం 18 నెలలుగా జీతాలు చెల్లించలేదని వాపోయారు. జీతాల కోసం ఆందోళన చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వ పెద్దలు మాయ మాటలుచెప్పి విరమింపజేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు.. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తమ సమస్యలను అనేక వేదికలపై ప్రస్తావించారని, అధికారంలోకి వస్తే ఆదుకుంటామన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్నట్టుండి తమను విధులనుంచి తొలగించారన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నారా లోకేష్ తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ధర్నా సందర్భంగా తిరుచానూరు పోలీసులు కలెక్టరేట్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లోకి కేవలం ముఖ్య నాయకులను మాత్రమే అనుమతించారు. కార్యక్రమంలో సుమారు 150 మంది ఎస్పీవోలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


మారుతీప్రసాద్ (ఫైల్)

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 9: సోమందేపల్లిలోని రాంబాబు కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మారుతీప్రసాద్(36) అప్పుల బాధ భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మారుతీప్రసాద్ మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. మగ్గం గిట్టుబాటుకాక నష్టాల పాలయ్యాడు. రూ.3 లక్షలు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అతడి భార్య శశికళ ఇంటికి తాళం వేసి, పని నిమిత్తం బయటికెళ్లింది. ఆ సమయంలో ఇంటికొచ్చిన మారుతీప్రసాద్ తాళాలు పగులగొట్టి, లోపలికి ప్రవేశించాడు. ఇంటి పైకప్పునకు చీరతో ఉరేసుకున్నాడు. కాసేపటికి ఇంటికొచ్చిన బంధువు.. మారుతీప్రసాద్ ఉరికి వేలాడుతుండడాన్ని చూసి వెంటనే చీరను కోసి, కిందికి దించాడు. భార్యకు సమాచారం అందించి, పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మారుతీప్రసాద్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నేతన్న ఆత్మహత్యపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మారుతీప్రసాద్‌కు కుమార్తె హర్షిత, కుమారుడు మధుసూదన్ ఉన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: యూటీఎఫ్

అనంతపురం విద్య, ఆగస్టు 9: ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీజీఎల్ఐ సూపరింటెండెంట్ కుళ్లాయప్పను యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి లింగమయ్య, ఇతర నేతలు శుక్రవారం ఆయనను కలిశారు. జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీల వివరాలు అప్‌డేట్ చేయలేదని, పాలసీదారులకు పెంచిన మొత్తాల పాలసీ బాండ్లు జారీ చేయలేదని అన్నారు. వాటి సమాచారం కూడా ఉద్యోగులకు, టీచర్లకు అందడం లేదని అన్నారు. ఉద్యోగ విరమణ పొందినవారికి పాలసీ మొత్తాలు సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. పాలసీ గడువు పూర్తయినా ఫైనల్ చెల్లింపులు జరగడం లేదని, చనిపోయిన ఉద్యోగులకు కూడా పాలసీ సొమ్ము సకాలంలో చెల్లించడం లేదని అన్నారు. ఉద్యోగుల నుంచి నెల నెలా ప్రీమియం జమ చేసుకుంటున్నారని, అయినా మిస్సింగ్ క్రెడిట్స్ ఎక్కువగా ఉన్నాయని అన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్‌ను వెంటనే నమోదు చేయాలన్నారు. ఏపీజీఎల్ఐ ద్వారా ఉద్యోగులు, టీచర్లకు అందాల్సిన మొత్తాలను వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నారాయణ, శ్రీనివాసులు, చంద్రమోహన్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరేడ్‌కు విద్యార్థి ఎంపిక


సంజీవరాయుడు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పరేడ్‌కు పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల విద్యార్థి కే సంజీవ రాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. సంజీవరాయుడు కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థిగా కూడా ఉన్నాడన్నారు. ఆ విద్యార్థి పరేడ్‌కు ఎంపికవడంపై ఎన్ఎస్ఎస్ అధికారి నారాయణ, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివిన 18-28 సంవత్సరాల మధ్య వయసున్న అభ్యర్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. బెంగళూరులో 35 రోజుల శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15 వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామని అన్నారు. త్వరలో ప్రారంభించే శిక్షణకు పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9000487423లో సంప్రదించాలని కోరారు.

సొంత జిల్లాలకు ఎంపీడీఓలు

అనంతపురం విద్య, ఆగస్టు 9: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాల నుంచి వచ్చిన 34 మంది ఎంపీడీఓలు వారి సొంత జిల్లాలకు వెళ్లనున్నారు. ఎంపీడీఓలను రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈఓ ప్రభాకర్ రావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి 33 మంది, నెల్లూరు జిల్లా నుంచి ఒక ఎంపీడీఓ జిల్లాకు వచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎంపీడీఓలు 38 మంది ఎన్నికల ముందు కర్నూలు, కడప జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కర్నూలుకు 23 మంది, కడపకు 15 మంది బదిలీపై వెళ్లగా, కర్నూలులో రిలీవ్ చేశారు. వారు జిల్లాకు వస్తున్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, ఆగస్టు 9: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 3,300 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 639టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 9: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జూన్, జూలైలో ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్23) రెగ్యులర్, (ఆర్15, 19, 20) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఒకటో సెమిస్టర్ (ఆర్15,19,20,23) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు 195 క్యూసెక్కుల నీరు


రెగ్యులేటర్ ద్వారా చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, ఆగస్టు 9: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 195 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.225 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు.

ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ హేమలత



అనంతపురం టౌన్, ఆగస్టు 9: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జిల్లా సర్వజన వైద్యశాల డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఎన్నికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో 2024-25 సంవత్సరానికి కమిటీని ఎన్నుకున్నారు. డాక్టర్ హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్యులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. జిల్లాకు చెందిన మరో ముగ్గురు డాక్టర్లకు స్టేట్ కమిటీలో చోటు కల్పించారు. అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ విభాగం చైర్మన్‌గా డాక్టర్ శ్రీనాథ్, ఐఎంఏ స్టేట్ వర్కింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ అభిషేక్ రెడ్డి, డాక్టర్ మనోరంజన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఐఎంఏ రాష్ట్ర కమిటీ అధికారికంగా వీరి ఎన్నికను ప్రకటించింది.

బాధ్యతల స్వీకరణ



అనంతపురం రూరల్, ఆగస్టు 9: విద్యుత్‌శాఖ టెక్నికల్ ఈఈగా ప్రసాద్ శుక్రవారం ఆ శాఖ ప్రధానకార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో హెచ్‌ఆర్‌డీ విభాగంలో డీఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొంది బదిలీపై అనంతపురానికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులూ.. నిర్లక్ష్యం వీడండి

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఆగ్రహం



హెచ్చెల్సీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గార్లదిన్నె, ఆగస్టు 9: సాగు, తాగునీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగు, తాగునీరు సరఫరా చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించారన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లపాటు సాగు, తాగునీరు విషయంలో ఏం చేశారో చూపాలని ప్రశ్నించారు. ఇక నుంచి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి సంబంధించి నివేదికలు అందచేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వాటిని తీసుకెళ్లి ప్రత్యేక నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం వినతులను స్వీకరించారు. సమావేశంలో ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ వెంకటరమణ నాయక్, ఏఓ సోమశేఖర్, వైద్యాధికారులు గౌతమి, రమేష్, సర్పంచులు మేడాపురం లక్ష్మి, ఉషారాణి, సుంకమ్మ, ఎంపీటీసీలు రామచంద్ర, విశ్వనాథ్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోండి: రైతు సంఘం నాయకులు

మండలంలోని 5వ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కెనాల్‌ను పూర్తి చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు కోరారు. సర్వసభ్య సమావేశానికి రైతు సంఘం, సీపీఎం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వేసిన వెంచర్లను స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందచేశారు. అక్రమ వెంచర్లను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఈశ్వరమ్మను ఆదేశించారు.

పేరు మార్చి.. పైశాచికానందం..

గత ప్రభుత్వంపై పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ధ్వజం

పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు పరిటాల రవీంద్ర పేరు పునరుద్ధరణపై హర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 9

ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రాజెక్టులు కట్టమంటే ఇదివరకే ఉన్న ప్రాజెక్టుల పేర్లను మారుస్తూ పైశాచిక ఆనందం పొందారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ధ్వజమెత్తారు. పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు పరిటాల రవీంద్ర పేరును పునరద్ధరించడం హర్షణీయమని శుక్రవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో వారు పేర్కొన్నారు. 2014-2019 మధ్య టీడీపీ పాలనలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించేందుకు అప్పట్లో సీఎం చంద్రబాబు రూ.804 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్టులను తీసుకొచ్చారన్నారు. పేరూరుకు నీరు తీసుకువచ్చేందుకు మొదటి నుంచి తపించిన పరిటాల రవీంద్ర పేరును ఈ పథకానికి చంద్రబాబు పెట్టారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టు పనులు ఒక్క అడుగు ముందుకు వెళ్లకపోగా ఈ పథకానికి పరిటాల రవీంద్ర పేరు తొలగించి, వైఎస్‌ఆర్ అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుగా పేరు మార్చారన్నారు. దీనిపై అప్పట్లో రాప్తాడు నియోజకవర్గం ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా జీవో నెంబర్ - 35 ద్వారా రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు పూర్వపు పేర్లను పునరుద్ధరించారన్నారు. ఇందులో భాగంగా పేరురు ప్రాజెక్టుకు తిరిగి పరిటాల రవీంద్ర లిఫ్ట్ ఇరిగేషన్‌గా పేరు మార్చినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మసీదు వద్ద మురుగునీరు కనిపించలేదా..?

టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుల మండిపాటు

అనంతపురం అర్బన్, ఆగస్టు 9: సప్తగిరి సర్కిల్‌లోని మసీదు వద్ద మురికి నీరు రోడ్డుపై పారుతున్నా కనిపించడం లేదా అని నగర మేయర్‌ను టీడీపీ ముస్లిం, మైనార్టీ నాయకులు నిలదీశారు. శుక్రవారం సప్తగిరి సర్కిల్ మసీదు కాంప్లెక్స్ వద్ద టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్ ఆధ్వర్యంలో మసీదు కాంప్లెక్స్ షాపుల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైఫుద్దీన్ మాట్లాడుతూ నెల రోజుల నుంచి మసీదు వద్ద కాలువలో మురుగునీరు నిల్వ ఉండటం, రోడ్డుపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు మేయర్ వసీం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, మదర్ వలి, జిలాన్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 9: తపోవనంలోని శివశక్తిసాయి దేవాలయంలో శుక్రవారం కాలభైరవ, వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో కలశస్థాపన, అంకురార్పణ, మూలవిగ్రహాలకు జల, ధాన్యాది, పుష్పాది, సయ్యాది వాసం నిర్వహించారు. అనంతరం రుత్వికుల వేదమంత్రోచ్చారణల నడుమ కాలభైరవ, వీరభద్రస్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రాణప్రతిష్ఠ గావించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, ఆలయ ధర్మకర్త శ్రీరాములు, దేవేంద్ర, ఎస్బీఐ విశ్రాంత మేనేజర్ రామ్‌గోపాల్, రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ సుజాన్, సుచిత్ర, బ్రహ్మానందరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ దొంగలపై ప్రత్యేక నిఘా

ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనంతపురం క్రైం, ఆగస్టు 9: సెల్‌ఫోన్లు దొంగలించే వారిపై ప్రత్యేక నిఘా వేశామని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ చేతుల మీదుగా మొత్తం 266సెల్‌ఫోన్లు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయవద్దని సూచించారు.

నాలుగో పట్టణ సీఐగా సాయినాథ్ బాధ్యతలు

నాలుగో పట్టణ సీఐగా సాయినాథ్ బాధ్యతలు స్వీకరించారు. సీఐ ప్రతాప్‌రెడ్డిని వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో వీఆర్, ఏఆర్‌లో ఉన్న సాయినాథ్‌ను ఫోర్త్‌టౌన్ సీఐగా నియమించారు. బాధ్యతలు తీసుకున్న సీఐ సాయినాథ్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత

బుక్కరాయసముద్రం, ఆగస్టు 9: మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామంలో నిరుపేదలైన టీడీపీ కార్యకర్తలకు రూ.25వేలు నగదును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ కార్యకర్త బండారు నడిపి కొండన్న అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులకు రూ. 10వేలు, టీడీపీ కార్యకర్త కందిబ్యాళ్ల కుళ్లాయప్పకు రూ.5వేలు, టీడీపీ కార్యకర్త బలిజ లక్ష్మయ్యకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

వృక్షాలను పరిరక్షించుకోవాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 9: వృక్షాలను పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని పీవీకేకే కళాశాల ప్రిన్సిపాల్ మునిరెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వృక్ష సంపదపై విద్యార్థులకు క్షేత్రస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిబ్యులస్ టెరిస్ట్రిస్, టెంపోషియా పర్ప్యూరియా తదితర మొక్కల ఆవశ్యకతను అధ్యాపకురాలు జోష్ణ వివరించారు.

ప్రజాపక్షపాతి బుద్ధదేవ్ భట్టాచార్య: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 9: ప్రజాపక్షపాతి బుద్ధదేవ్ భట్టాచార్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాపంగా శుక్రవారం సాయంత్రం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తర్వాత కూడా ఆయన రెండు గదుల అపార్ట్‌మెంట్‌లోనే నివసించారంటే ఆయన నిరాడంబరత ఏంటో అర్థం చేసుకోవచ్చునన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, వెంకటనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగమణి, ప్రకాష్, శివ పాల్గొన్నారు.

'కార్పొరేట్ చేతుల్లోకి దేశ సంపద'

అనంతపురం విద్య, ఆగస్టు 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వల్ల దేశ సంపద కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తోందని, కార్పొరేట్‌ను తరిమి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఏపీ రైతు కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్-సేవ్ అగ్రికల్చర్ నినాదంతో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లలితకళా పరిషత్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి, ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ గౌడ్, ఇతర నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ నిర్ణయాలను, చర్యలను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగమణి, ఇతర నాయకులు నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలను తరిమికొడదాం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9: అడవులను నాశనం చేస్తున్న కార్పొరేట్ సంస్థలను తరిమికొట్టాలని రైతు, రైతుకూలీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ, క్విట్‌ఇండియా ఉద్యమ దినోత్సవ స్ఫూర్తితో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తరిమెల నాగిరెడ్డి విగ్రహం నుంచి టవర్‌క్లాక్ వరకు నగరంలో ర్యాలీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రైతు సంఘం సీపీఐ, సీపీఎం అనుబంధ జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అడవుల నుంచి ఆదివాసుల గెంటివేతలను నిలుపుదల చేయాలన్నారు.

ఎస్కేయూలో కారుణ్య నియామకం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 9: కారుణ్య నియామకం కింద ఎస్కేయూలో రామకృష్ణకు అటెండర్ ఉద్యోగాన్ని కల్పించారు. శుక్రవారం ఇన్‌చార్జ్ వీసీ అనిత ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. హస్టల్ సర్వర్‌గా పనిచేస్తున్న వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందడంతో అతడి కుమారుడు రామకృష్ణకు ఉద్యోగాన్ని కల్పించామని వీసీ తెలిపారు.

మునికోటికి ఘన నివాళి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9: ప్రత్యేక హోదా కోసం ప్రాణాలర్పించిన మునికోటికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ మునికోటి త్యాగం మరువలేనిదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శంకర్, జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసు, నాయకులు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

'పేర్లు నమోదు చేసుకోండి'

అనంతపురం అర్బన్, ఆగస్టు 9: జిల్లాలోని రైతులు డ్రిప్, స్ప్రింకర్ల కోసం పేర్లను నమోదు చేసుకోవాలని ఏపీ ఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఆటోల ద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం, 1 బీ, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌తోపాటు రైతు పాస్‌పోర్టు సైజు ఫోటో సమర్పించాలన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత అనంత జట్టు

అనంతపురంరూరల్, ఆగస్టు 9: విద్యుత్‌శాఖ ఇంటర్ సర్కిల్ బాల్‌బ్యాడ్మింటన్ విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. శ్రీశైలంలో నిర్వహించిన టోర్నీలో 16 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం కర్నూలు, అనంతపురం మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో మేనేజర్ వెంకటనారాయణ, జట్టు సారధి ప్రభాకర్, సభ్యులు బాబా, శివకుమార్, అనిల్, రవి, పవన్ ఉన్నారు.

'అభివృద్ధికి సమష్టిగా కృషి'

రాప్తాడు, ఆగస్టు 9: వాల్మీకుల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య పిలుపునిచ్చారు. మండలంలోని బండమీదపల్లి గ్రామంలో కమ్యూనిటీ భవనంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ సమష్టిగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎస్టీ జాబితాలో కలిపే వరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కేశవ, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల గోవిందు, యూత్ జిల్లా అధ్యక్షుడు అఖిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగార్జున, అనంతపురం టౌన్ కార్యదర్శి బోయ ముత్యాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 9: మండలంలోని ప్యాదిండి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్యాదిండికి చెందిన ఓబిలేసు ద్విచక్రవాహనంలో ధర్మవరం వెళ్తుండగా ప్యాదిండి సమీపంలో ధర్మవరం నుంచి ఎన్‌ఎస్‌గేటు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. అదేలారీ ప్యాదిండి గ్రామం నుంచి ధర్మవరం వైపు కాలినడకన వెళ్తున్న కోనయ్యను ఢీకొంది. వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ఓబిలేసు, కోనయ్య తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

నేడు బాలికల ఫుట్‌బాల్ సెమీ ఫైనల్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9: బాలికల జాతీయ ఫుట్‌బాల్ గ్రూప్ సీలో తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాల మధ్య సెమీఫైనల్ పోరు ఉంటుందని ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మల్లేష్ తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక ఆర్డీటీ స్టేడియంలో సెమీఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9: జిల్లాలోని చౌకధాన్యపు డిపోల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో వెంకటనారాయణకు చెందిన చౌకధాన్యపు డిపోను తనిఖీ చేసి రికార్డులు, భౌతిక నిల్వలకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. భౌతిక నిల్వలను స్వాధీనం చేసుకుని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఏఓ వాసు ప్రకాష్, ఏజీహెచ్‌ఎం శివప్రసాద్, సీఎస్‌డీటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ సదస్సుకు అర్బన్‌బ్యాంకు ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9: విజయవాడలో జరిగిన ఆర్‌బీఐ రాష్ట్రస్థాయి సదస్సుకు అర్బన్‌బ్యాంకు ప్రతినిధులు హాజరయ్యారు. అర్బన్ బ్యాంకుల ఆర్థిక వ్యవహారాలు, పరిపాలనపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ వివరించారు. అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ తమ బ్యాంకు ప్రగతిని తెలియజేశారు. తమ సేవలు మరింత విస్తృతం చేయడానికి చైర్మన్ జేఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, డైరెక్టర్ రొళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లపై అవగాహన

అనంతపురంరూరల్, ఆగస్టు 9: మండలంలోని ఎ-నారాయణపురం పంచాయతీ సచివాలయం-1లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వితంతు పింఛన్లపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ న్యాయాధికారి శివప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, డీపీఓ ప్రభాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివప్రసాద్ వితంతువులకు రావాల్సిన పెన్షన్లపై అవగాహన కల్పించారు. సమస్యలుంటే వాటిని న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఏవిధంగా పరిష్కరించుకోవచ్చు తదితర విషయాలను వివరించారు. సమస్యలు ఉంటే పరిష్కరించాలని డీఆర్‌డీఏ పీడీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మద్దిలేటి, ఏపీఎం శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకార డెయిరీని పునఃప్రారంభించాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 9: వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ సహకార డెయిరీని నిర్వీర్యంచేసి ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చారని, దానిని పునఃప్రారంభించి జిల్లా పాడిరైతులకు ప్రత్యామ్నాయం కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్‌చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో శారదానగర్‌లోని ఏపీ డెయిరీని సందర్శించారు. అనంతరం డెయిరీ డీడీ ప్రభాకర్‌రెడ్డి, మేనేజర్ నారాయణమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాలసేకరణ సభ్యులు నాగరాజు, మాధవి, రాజు, కృష్ణవేణి, అరుణమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి పుట్టినరోజు వేడుక



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఆగస్టు 9: అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనగర్ కాలనీలోని పార్టీ అర్బన్ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. రాయల్ మురళీ, వెంకటప్ప, కూచి హరి, గంగారామ్, నెట్టెం బాలకృష్ణ, చంటి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణ

అనంతపురం రూరల్, ఆగస్టు 9: మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ -1 నుంచి గ్రేడ్-5లకు పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై ఈనెల 12 నుంచి రిఫ్రెషర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో మూడురోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు.

పరికరాల పంపిణీ

గార్లదిన్నె, ఆగస్టు 9: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి గౌతమి ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులకు శుక్రవారం పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మసేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

కూడేరు, ఆగస్టు 9: బోరు బావులున్న రైతులు సూక్ష్మసేద్యం పరికాలైన డ్రిప్పులు, స్ప్రింక్లర్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి సూచించారు. మండలంలోని గొట్కూరు గ్రామంలో శుక్రవారం ఆయన ప్రభుత్వం సబ్సిడీపై అందించే డ్రిప్పులు, స్ప్రింక్లర్లపై ఫినోలెక్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. వీటిని పొందేందుకు ఆసక్తి గల రైతులు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోలని సూచించారు. రైతులు, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధులు నాగరాజు , ఏపీఎంఐపీ అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు వేగవంతం చేయండి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 9: డ్రైనేజీలపై చేపడుతున్న కల్వర్టు పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పేర్కొన్నారు. పట్టణంలోని 9వ వార్డులో జనరల్ ఫండ్స్ కింద చేపడుతున్న డ్రైనేజీ కల్వర్టు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్ప, ఏసీపీ సత్తార్, టీపీఎస్ మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

గుత్తి, ఆగస్టు 9: కేరళ రాష్ట్రంలోని వాయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి మృతిచెందిన కుటుంబాలను ఆదుకునేందుకు పట్టణంలో సీపీఎం నాయకులు శుక్రవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, గాంధీ సర్కిల్, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాల వద్ద విరాళాలను సేకరించారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా విరాళాలు అందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నిర్మల, రేణుక, రేవతి, నరసింహ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీసభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

రాయదుర్గం రూరల్, ఆగస్టు 9: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని కోరారు.

12 నుంచి శిక్షణ తరగతులు

కళ్యాణదుర్గం (శెట్టూరు), ఆగస్టు 9 : మండల వ్యాప్తంగా ఉన్న 16 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు ఈ నెల 12, 14వ తేదీల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఈవోఆర్డీ రఘురామారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 12న అనుంపల్లి, అయ్యగార్లపల్లి, బొచ్చుపల్లి, చెర్లోపల్లి, చిన్నంపల్లి, చింతర్లపల్లి, ఐదుకల్లు గ్రామాల సర్పంచ్‌లకు, 14న కనుకూరు, కైరేవు, లక్ష్మంపల్లి, మా కొడికి, ములకలేడు, పెరుగుపాల్యం, శెట్టూరు, తిప్పనపల్లి, యాటకల్లు గ్రామాల సర్పంచ్‌లకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో వ్యర్థ పదార్థాల ద్వారా ఎరువుల తయారీ, వీధి లైట్ల నిర్వహణతదితర అంశాలపై శిక్షణ ఇవ్వనునున్నట్లు చెప్పారు.

బొమ్మనహాళ్: మండలంలోని సర్పంచులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్, ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ పంచాయతీల సర్పంచులకు మండల పరిషత్ కార్యాలయంలో పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు

గుమ్మఘట్ట, ఆగస్టు 9: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నూతన తహశీల్దార్‌గా ఎస్ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లాలో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలందజేసి ఘనస్వాగతం పలికారు.

59.8 మి.మీ. వర్షపాతం నమోదు

బెళుగుప్ప, ఆగస్టు 9: మండలంలోని గురువారం భారీ వర్షం కురిసింది. 59.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కోసం ఎదురుచూస్తున్న కంది పంట రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని గ్రామాల్లో భారీ వర్షం కురవగా.. మరికొన్ని గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

పారిశుధ్య కార్మికుడికి ఆర్థిక చేయూత

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 9: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశులుకు స్థానిక సచివాలయ ఉద్యోగులు ఆర్థిక చేయూతనందించారు. వెంకటేశులు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సచివాలయ ఉద్యోగులు అతని భార్యకు రూ. 14 వేలు అందించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మసముద్రం, ఆగస్టు 9: మండలంలోని పాల వెంకటాపురం పైదొడ్డి పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ నగేష్, తెలుగుదేశం నాయకుడు శివ యాదవ్ కలిసి శుక్రవారం పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. సమస్యను పరిష్కారం కావడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

చెస్‌టోర్నీ కరపత్రాల విడుదల

గుంతకల్లు టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం చెస్‌టోర్నమెంట్ కరపత్రాలను స్థానిక మాస్టర్ చెస్ అకాడమీ సభ్యులు, సీపీఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకాడమీ సభ్యులు అనిల్‌కుమార్, రామారావు మాట్లాడుతూ చేగువేరా మెమోరి యల్ చదరంగం పోటీలను సెప్టెంబరు1వ తేదీన స్థానిక సీపీఐ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నామన్నారు. పాల్గొనే యువత, విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9642572763కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య పశ్చిమబెంగాల్‌కు మూడుదశాబ్దాల పాటు మంత్రిగా, 11సంవత్సరాలు ముఖ్యమంత్రిగా సేవలందించారని కొనియాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బీ శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డీ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో శుక్రవారం నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సంత్‌సేవాలాల్ మహరాజ్, ఏకలవ్యుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు చ లపతి, రాముడు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లపై నివేదిక ఇవ్వండి

● అధికారులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశం



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి, ఆగస్టు 9: నియోజకవర్గవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల వివరాలపై నివేదిక తయారు చేసి తనకు ఇవ్వాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడా కూడా దెబ్బతిన్న రోడ్లు కనిపించకూడదన్నారు. గత ఐదేళ్ల గుంతల రోడ్లతో ప్రజలు నరకం అనుభవించారన్నారు. వేగవంతంగా నివేదికలు తయారుచేయాలన్నారు. సజ్జలదిన్నె- ఆలూరు రోడ్డు, యర్రగుంటపల్లి- ఇగుడూరు రోడ్డు, తాడిపత్రి నుంచి తేరన్నపల్లి మీదుగా కడవకల్లు వరకు, యాడికి మండలంలోని రాయలచెరువు- చందన, యాడికి- బుగ్గ రోడ్డు, నిట్టూరు-మిడుతూరు రోడ్డు, పెద్దపప్పూరు మండలంలో చిన్నపప్పూరు నుంచి పెద్దయక్కలూరు వరకు, అమ్మలదిన్నె- వరదాయపల్లి, పెద్దపప్పూరు నుంచి రావివెంకటాంపల్లి రోడ్లతోపాటు పెద్దవడుగూరు మండలంలోని ముప్పాలగుత్తి- బీమునిపల్లి, కొండుపల్లి- రావులుడికి రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఈ రోడ్లతోపాటు చిన్నచిన్న మరమ్మతులు చేయాల్సిన రోడ్ల వివరాలను కూడా రెండురోజుల్లో చెప్పాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ డీఈ సురేష్‌నాయక్, సత్యనారాయణ, పీఆర్ డీఈ రజనీకాంత్ రెడ్డి, ఏఈలు సురేష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ప్రసన్నలక్ష్మి, శ్రీదేవి, రామచంద్రారెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

పట్టణంలోని నందలపాడులో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల గదులు, ఆవరణంలోని పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువును అభ్యసించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రోగులతోపాటు వారి బంధువులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఆరాతీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని కోరారు. వర్షాకాలం కావడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకురావడంతో వెంటనే ఆయన దోమల నిర్మూలనకు వెంటనే చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జున, జయకుమార్, సోమశేఖర్‌నాయుడు ఉన్నారు.

ఇసుక డంప్‌ల పరిశీలన

పట్టణంలోని నందలపాడు, శ్రీనివాసపురంలో ఇసుక డంప్‌లను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లకట్టడాలకు ఇసుకను వాడుకోవచ్చునన్నారు. డంపింగ్ చేస్తే మాత్రం ఎవరైనా సరే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ఎక్కడెక్కడ ఇసుక డంపింగ్‌లో ఉన్నాయో ఆరాతీశారు. శ్రీనివాసపురం, నందలపాడు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ఇసుకను జిల్లాను దాటిస్తున్నారని తనకు సమాచారం వచ్చిందన్నారు. ఇప్పటి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే సహించమని హెచ్చరించారు. ఇసుక డంప్‌లను వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 9: రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఉద్యానవన శాఖాధికారి కృష్ణ తేజ సూచించారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఈ పంట నమోదుపై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సెప్టెంబరు 15వ తేదీ లోగా సర్వే నెంబర్ వారిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, ఏడీఏ యల్లప్ప, హార్టికల్చర్ ఏడీ ఉష, కళ్యాణదుర్గం డివిజన్ వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు , రైతులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: రాయదుర్గం డివిజన్‌లో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని ఉద్యానవన అధికారి మౌనికప్రకటనలో తెలిపారు. అనంతరం ఉద్యానశాఖ తరపున ప్రభుత్వం అమలు చేసే రాయితీలు పొందాలంటే ప్రతి ఒక్కరైతు ఉద్యానపంటను సర్వేనెంబర్ వారీగా ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించి ఈ పంట నమోదును సెప్టెంబర్‌లోగా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

ఆనర్స్ కోర్సులకు అనుమతి

గుంతకల్లు టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో నాలుగు సంవత్సరాల ఆనర్స్ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుమతి మంజూరు చేసిందని కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బయోటెక్నాలజీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ కోర్సులకు ఈ విద్యాసంవత్సరం నుంచే నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రారంభిస్తామని అన్నారు. అవకాశాన్ని గుంతకల్లు పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు సంవత్సరాలు డిగ్రీ పూర్తి చేసి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ కోర్సులలో చేరవచ్చన్నారు. ఆనర్స్ కోర్సులో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్‌మెంట్ అవకాశం ఉంటుందని చెప్పారు. ఒకేసారి తమ కళాశాలలో నాలుగు ఆనర్స్ కోర్సులకు అనుమతి లభించడం హర్షణీయమన్నారు. మరిన్ని వివరాలకు 7569958353ను సంప్రదించాలన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగురవేయాలి

తాడిపత్రి, ఆగస్టు 9: స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీన ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ వీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11 నుంచి 15 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరపాలన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, యువమోర్చా నాయకులు పృథ్వీనాథ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బెళుగుప్ప నుంచి బళ్లారికి ఆర్టీసీ బస్సు

బెళుగుప్ప, ఆగస్టు 9 : మండల కేంద్రం నుంచి కర్ణాటకలోని బళ్లారికి ఆర్టీసీ బస్సు సర్వీసు నడపడానికి ఉరవకొండ డిపో అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో బళ్లారికి వెళ్లాలంటే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండ్లపల్లికి వెళ్లి అక్కడి నుంచి పోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇక్కడి నుంచే హోన్నూరు, రూపనగుడి మీదుగా బళ్లారికి ఉదయం 5 గంటలకు, మధ్యాహ్నం 3.30 గంటలకి బస్సులు బయలు దేరుతాయి. ఇందుకు మండలప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

12న చేపల చెరువు వేలం

రాయదుర్గంరూరల్, ఆగస్టు 9: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ పరిధిలో ఉన్న చెరువులో చేపలు పెంచుకుని అమ్ముకునే హక్కు కల్పించేందుకు గాను ఈ నెల 12వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గలవారు రూ. వెయ్యి ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 9: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి జోలికి వెళ్లి జీవతం నాశనం చేసుకోవద్దని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాలబాయి సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా సమీపంలోని అబుల్‌కలాం అజాద్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు మరణానికి మార్గాలన్నారు. మత్తుపదార్థాలైన పొగాకు, గంజాయి, డ్రగ్స్ తదితర వాటి వల్ల అనేక రోగాలు వస్తాయన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ బారిన పడే ప్రమాదముందన్నారు. కనుక ఎవరూ వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు శివప్రసాద్, రాజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు వాటి దుష్పలితాలు అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో విద్యార్థులు జీవితంలో మాదవద్రవ్యాల జోలికి ఎప్పుడూ వెళ్లమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి నారాయణ, అడ్వైజర్ రవిశంకర్‌శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మహమ్మద్‌రఫీ (ఫైల్)

ఉరవకొండ, ఆగస్టు 9: పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన యువకుడు మహమ్మద్‌రఫీ(22) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీరా, రబియా దంపతుల కుమారుడైన మహమ్మద్‌రఫీ మెకానిక్ పనులతో పాటు చీటీల వ్యాపారం చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కాగా గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో శుక్రవారం తీవ్ర మనోవేదనకు గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి కుటుంబసభ్యులు గమనించి వెంటనే ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వడ్లపాలెంలో మరొకరు..

తాడిపత్రి: పట్టణంలోని వడ్లపాలెంకు చెందిన యువకుడు శ్రీనివాసులు (28) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ గోపాల్‌నాయుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ శ్రీరంగ వద్ద పెరిగాడు. అతడికి కొంతకాలంగా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో వివాహం కాలేదు. దీంతో జీవితంపై విరక్తిచెంది రెండురోజుల క్రితం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి అన్న ఉదయభాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పుట్లూరు, ఆగస్టు9: మండలంలోని సూరేపల్లి గ్రామశివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.2050 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాట కేంద్రంపై దాడిచేసి పేకాటరాయుళ్లను అరెస్టుచేసి కేసు నమోదుచేసినట్లు ఆయన చెప్పారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

బొమ్మనహాళ్, ఆగస్టు 9 : మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ చంద్రశేఖర్(33) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు చెప్పారు. టీడీపీలో ఆయన క్రియాశీలకంగా పనిచేశారు. గతగురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో ఆయన భార్య మల్లమ్మ గ్రామ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యురాలిగా ఎన్నికైంది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చంద్రశేఖర్ కుటుంబానికి సంతాపం తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బెళుగుప్ప, ఆగస్టు 9 : మండలంలోని కాలువపల్లికి చెందిన సుగాలి ఆంజనేయులు అదృశ్యంపై ఫిర్యాదు అందడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆంజనేయులు కొద్దిరోజుల నుంచి కనిపించడం లేదు. దీంతో కుటుంబసభ్యులు అనేక చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆయన బావ మిట్ట నాయక్ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

తాడిపత్రి, ఆగస్టు 9: కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో శుక్రవారం వారు పట్టణంలోని గాంధీవిగ్రహానికి పూలమాలలు వేసి క్విట్ కార్పొరేట్, ఇండియా సేవ్ అగ్రికల్చర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ దేశసంపదను లూటీచేస్తున్న కార్పొరేట్ కంపెనీలు దేశం వదిలి వెళ్లాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టే విధానాలను అనుసరిస్తోందని దుయ్యబట్టారు. రైతులను రక్షించే విత్తన చట్టంను నీరుగారుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదేనా వికసిత్ భారత్ అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శిరీష, జయశేఖర్, అంకిరెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కూడేరు, ఆగస్టు 9: మండలంలోని గొట్కూరు గ్రామంలో స్థల వివాదం ఘర్షణకు దారి తీసింది. ఇందులో ఎర్రిస్వామి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గత కొంత కాలం నుంచి స్థలంపై ఎర్రిస్వామి, గంగన్నల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఎర్రిస్వామి పశువుల వద్దకు వెళుతుండగా గంగన్నతో పాటు అతని కుమారులు పవన్, రాజా దాడి చేశారు. ఎర్రిస్వామికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు తెలిపినట్లు బాధితుడు పేర్కొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

● 11గంటలైనా విధులకు రాని వైనం

ఉరవకొండ, ఆగస్టు 9: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ముఖ్యంగా కొనకొండ్ల సచివాలయం-1 సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. శుక్రవారం ఉదయం 11గంటలు అయినా ఉద్యోగులు ఎవరూ విధులకు హాజరు కాకపోవడంతో కార్యాలయంలోని కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కార్యాలయంలో 9మంది దాకా సిబ్బంది ఉన్నా.. ఒక్కరూ కూడా హాజరు కాకపోవడం గమనార్హం.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

పామిడి, ఆగస్టు 9 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌస్‌పీరా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్ కృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎంసీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లతో గుమ్మనూరు ఈశ్వర్

వైసీపీ నాయకుల దౌర్జన్యాలను అరికట్టండి

● ఎస్పీని కోరిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



ఎస్పీకి పూలమొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, ఆగస్టు 9: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువైపోతున్నాయని వాటిని అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ మురళీకృష్ణను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. వాటికి అడ్డుకట్ట వేయాలని కోరారు. ఇందుకు సమర్థులైన పోలీసు అధికారులను, సిబ్బందిని నియమించాలని కోరారు. స్పందించిన ఎస్పీ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

● బెళగావి - హుబ్లి మార్గంలో నడిచే రైళ్ల దారి మళ్లింపు

● రాయదుర్గం మీదుగా మరికొన్ని



దూద్‌సాగర్ - సోనాలిం మధ్య పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 9: బెళగావి - హుబ్లి రైలు మార్గంలో శుక్రవారం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దూద్ సాగర్, సొనాలి స్టేషన్ల మధ్య బొగ్గును తీసుకెళుతున్న ఈ గూడ్స్ రైలుకు చెందిన 11 బోగీలు పట్టాలు తప్పినట్లు నైరుతి రైల్వే అధికారులు ప్రకటించారు. గోవాలోని వాస్కోడాగామా నుంచి హొసపేట మీదుగా బళ్ళారి జిల్లాలోని జిందాల్ ఉక్కు కర్మాగారానికి బొగ్గును తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని నైరుతి రైల్వే ముఖ్య అధికారి మంజునాథ్ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రైలు నెం 17420/17022 వాస్కోడగామా - తిరుపతి/హైదరాబాద్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్ళ రాకపోకల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయని పేర్కొన్నారు. ఆ మార్గంలో సంచరించాల్సిన రైళ్ళను దారిమళ్లించి మడగాంవ్, కారవార, పడీల్, సుబ్రమ్మణ్య రోడ్, హాసన, అరిసికెర, చిక్కజాజూర్, రాయదుర్గం మీదుగా నడవనున్నట్లు తెలిపారు. రైలు నెంబరు 12799 వాస్కోడగామా - హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌ను అన్నుమడగావ్, రోహా, పన్వెల్, కళ్యాణ, పుణే మార్గం గుండా నడుపుతుండగా, రైలు నెంబరు 12780 హజరత్ నిజాముద్దీన్ - వాస్కోడాగామా ఎక్స్‌ప్రెస్‌ను పూణె, పన్వల్, రోహా మడగావ్ మీదుగా నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హౌసింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

● మండల సమావేశంలో వ్యాసాపురం సర్పంచ్ డిమాండ్

ఉరవకొండ, ఆగస్టు9: అక్రమాలకు పాల్పడిన హౌసింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ంలో శుక్రవారం ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఇందులో పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వ్యాసాపురం సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమ గ్రామంలో పలువురికి ఇళ్లు నిర్మించకుండానే హౌసింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేశారన్నారు. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో రేషన్‌బియ్యం సక్రమంగా సరఫరా చేయడం లేదని, సరిగా సరఫరా జరిగేలా చూడాలని తహసీల్దార్ మహబూబ్ బాషా దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా తమ గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ డబ్బులు ఇవ్వందే పనులు చేయడం లేదని, అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎండీయూ వాహనాలు గ్రామాల్లోకి రావడం లేదని నెరమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి విన్నవించారు. హెచ్చెల్సీకి నీళ్లు వచ్చినా, నీటిని పంపింగ్ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బరాజు, జడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉరవకొండలో వైసీపీకి షాక్

● రాజీనామా బాటలో మైనార్టీ నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 9: పట్టణంలో వైసీపీకి భారీ షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు రాజీనామా బాట పట్టారు. దీంతో మైనార్టీల్లో ఆపార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలుతోంది. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. వైసీపీ వైపున ఉన్న మైనార్టీ నాయకులంతా ఆ పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే వైసీపీకి, మండల కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, యువజన విభాగం నాయకుడు వడ్ల సలీం రాజీనామా చేశారు. తాజాగా గురువారం రాత్రి మైనార్టీ నాయకుడు, జైనబ్బీ దర్గా కమిటీ ఛైర్మన్ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుని, రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మైనార్టీ నాయకులు వరుసగా ఒకరి తర్వాత ఒకరు రాజీనామా చేస్తుండటంతో వైసీపీ డీలా పడుతోంది. ఆ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు స్తబ్ధతగా ఉన్నారు. కొంత మంది పార్టీతో అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు పిలిచినా ముఖం చాటేస్తున్నారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులంతా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలి

● రైతుల డిమాండ్ ● సబ్‌స్టేషన్ ముట్టడి

బ్రహ్మసముద్రం, ఆగస్టు 9 : వ్యవసాయానికి విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలంటూ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గల విద్యుత్ సబ్ స్టేషన్‌ను స్థానిక రైతులు శుక్రవారం ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత వారం రోజులుగా వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని వాపోయారు. మధ్యాహ్నం , రాత్రి సమయాల్లో రెండు విడతలుగా వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తున్నారని, అది కూడా ఏ టైమ్‌లో సప్లై ఇస్తారో తెలియక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. కరెంట్ సరఫరా సరిగా లేక పంటలకు నీరు సక్రమంగా పెట్టుకోలేకపోతున్నామన్నారు. ఫలితంగా పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయన్నారు. ఇకపైనా అధికారులు వ్యవసాయానికి కరెంట్‌ను సక్రమంగా సరఫరా చేయాలని కోరారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు

బొమ్మనహాళ్, ఆగస్టు 9 : మండలంలోని దేవగిరిక్రాస్ వద్ద బళ్లారి - కళ్యాణదుర్గం రహదారి పక్కన ఉన్న చింతచెట్టు శుక్రవారం మధ్యాహ్నం విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొద్దిరోజుల క్రితం ఒక వాహనం ఆ ఢీ కొట్టింది. దీంతో దెబ్బతిన్న చెట్టు శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా విరిగిపడిందని స్థానికులు తెలిపారు. చెట్టు కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొద్దిసేపటికి స్థానికులు ఆ కొమ్మలను తొలగించారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

కుందుర్పి, ఆగస్టు 9: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్త లక్ష్మణమూర్తి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు , టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మతేజ సూచన మేరకు స్థానిక టీడీపీ నాయకులు అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. రూ. ఐదు వేలు ఆర్థిక సాయం చేశారు. సీనియర్ నాయకులు పెద్ద నరసింహప్ప, ఎస్ మల్లికార్జున, కన్వీనర్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఓ గుర్తింపునకు సిద్ధమవుతున్న తహసీల్దార్ కార్యాలయం



ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం

ఉరవకొండ, ఆగస్టు 9: ప్రతిష్టాత్మక ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను పొందేందుకు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం సిద్ధమవుతోంది. ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రం కావడంతో, ఐఎస్ఓ గుర్తింపునకు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అధికారులు ఎంపిక చేశారు. ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కార్యాలయాన్ని ముస్తాబు చెయ్యడానికి అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన చర్యలపై ఆర్డీవో సూచనలు చేశారు. ఇటీవల గుంతకల్లు ఆర్డీవో కార్యాలయం ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందిన విషయం తెలిసిందే. ఐఎస్ఓ గుర్తింపు ద్వారా సేవలు మరింత వేగవంతమవుతాయి.